చినుకు పడితే చీకటే..

- గంటల కొద్దీ కరెంట్ కట్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


నస్రుల్లాబాద్‌లోని సబ్‌స్టేషన్


నస్రుల్లాబాద్‌లో అలుముకున్న అంధకారం

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : వర్షాకాలం ప్రారంభమై పూర్తి కావస్తుంది. కాని అనుకున్న స్థాయిలో వర్షాలు పడక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు కాస్త చినుకులు పడినా కూడా నస్రుల్లాబాద్ మండల సబ్ స్టేషన్ పరిధిలోని నస్రుల్లాబాద్, మైలారం, బొప్పాస్‌పల్లి, లింగంపల్లి, బొప్పాస్ పల్లి, నెమ్లి, కామిశెట్టి పల్లి గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ప్రతిరోజూ ఇలాగే చిన్న పాటి వర్షానికే పవర్ కట్ అవుతుండటంతో ఇబ్బందులకు గురి అవుతున్నారు. దీనికి తోడు వరి నాట్లు మొదలవ్వడంతో ఉదయం నీరు పారిద్దామనుకున్న సమయంలో కరెంట్ లేకపోవడంతో రైతుల వేదన అంతాఇంతా కాదు.

నాలుగు రోజులుగా..

నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ఉన్న సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నాలుగు రోజులుగా మైలారం ఫీడర్ ఉంది. అయితే ఈ ఫీడర్ పరిధిలో రాముల గుట్ట తండా, లింగంపల్లి, బొప్పాస్‌పల్లి, మైలారం, ఫకీరా నాయక్ తండా, తార్య నాయక్ తండా గ్రామాలున్నాయి. గ్రామాలతో పాటు ఏజీఎల్ కూడా ఒకే లైన్ ఉంటుంది. ఈ గ్రామాల పరిధిలో పంట పొలాలకు కూడా ఇదే లైన్ ఉండటంతో ప్రజలు కరెంటు కోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో అటు వ్యవసాయ రైతులు, ఇటు గృహ వినియోగ దారులు ఉదయం 5.45 గంటల నుంచి 6.50గంటల వరకు విద్యుత్ కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. ఈ విషయంపై సబ్‌స్టేషన్ సిబ్బందికి ప్రశ్నించగా ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని వారు పేర్కొన్నారు.

అధికారుల జాడ కరువు..

అత్యవసర సేవలలో ఉన్న విద్యుత్ శాఖ సిబ్బంది అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లో ఉండాల్సి ఉండగా కిందిస్థాయి సిబ్బందిని ఉంచి మిగితా వారు వెళ్లి పోతున్నారు. లైన్‌మన్‌లు, ఏఈలు మాత్రం బాన్సువాడ, బీర్కూర్ వంటి గ్రామాల్లో ఉంటున్నారు. వర్షాలు, గాలుల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే తాపీగా గంటల తర్వాత వచ్చి కిందిస్థాయి ఉద్యోగులపై ఆగ్రహం వ్యకం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా దూర ప్రాంతాల్లో ఉంటు విధులు నిర్వహిస్తున్నా కూడా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు దారి తీస్తుంది.

కొండీలు వేస్తున్నారు..

ఉదయం సమయంలో విద్యుత్‌కు అంతరాయం రావడానికి కారణం ప్రజల నిర్లక్ష్యమే. ప్రధాన లైన్లకు కొండీలు వేస్తుండడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

– అరవింద్, ఏఈ,నస్రుల్లాబాద్

సమస్య పరిష్కరించాలి..

మైలారం గ్రామంలో చాలారోజుల విద్యుత్ కోతకు గురవుతుంది. ఈ విషయం కోసం సబ్ స్టేషన్ సిబ్బందిని అడుగగా ఉన్నతాధికారులకు తెలియజేశామంటున్నారు. కాని ప్రతి రోజు గంటల కొద్దీ కరెంటు పోతోంది.

– లక్కీ యాదవ్, మైలారం

క్లుప్తంగా

నోట్ పుస్తకాల అందజేత



రాజంపేట : గంగపుత్ర చారిటబుల్ ట్రస్ట్ రాజంపేట ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన 8వ, 9వ, 10 తరగతి విద్యార్థులకు ఆదివారం నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు సతీష్ మాట్లాడుతూ గంగపుత్ర చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. మధ్యాహ్న భోజన ప్లేట్లు, గ్లాసులు అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. 2024–25లో 10వ తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ. 5వేలు అందజేస్తామని హెచ్‌ఎం ఈశ్వరయ్య, గ్రామ గంగపుత్ర సంఘం అధ్యక్షులు బెస్త చంద్రం ప్రకటించారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మండలాల లారీ యజమానుల ఆధ్వర్యంలో నూతన లారీ ఓనర్స్ అసోసియేషన్ కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఖుద్దూస్, కార్యదర్శిగా షేక్‌కరీం, ఉపాధ్యక్షుడిగా కుమ్మరి దత్తు, క్యాషియర్‌గా ఆసిఫ్ బేగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాతీయ కార్యశాలలో పాల్గొన్న సంతోష్ గౌడ్



బీబీపేట : ఢిల్లీలోని జాతీయ సామాజిక సాధికారిక సంస్థలో ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులతో మూడు రోజుల పాటు జరిగిన జాతీయ సెమినార్‌లో బీబీపేట్ గ్రామానికి చెందిన డా సంతోష్ గౌడ్ పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన సెమినార్లో భాగంగా, వృద్ధుల సంక్షేమం, లింగమార్పిడి వారి సంక్షేమం, భిక్షం నివారణ, మాదకద్రవ్యాల నివారణ నాలుగు అంశాలపై మూడు రోజులు జరిగిన చర్చ, సమాలోచనలు ప్రొఫెసర్లు, పరిశోధన విద్యార్థులతో కలిసి అనంతరం పత్ర సమర్పణ జరిగిందని సంతోష్ తెలిపారు.

బదిలీపై వెళ్తున్న పోలీసులకు సన్మానం



కామారెడ్డి క్రైం : కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహించి సిద్దిపేట కమిషనరేట్ కు బదిలీపై వెళ్తున్న ఎస్సై ఇంద్రసేనా రెడ్డికి ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. శాలువాలతో సత్కరించి విధుల్లో భాగంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పట్టణ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సైలు శ్రీరాం, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సై కొమురయ్య..



దేవునిపల్లి పోలీస్ స్టేషన్లో రెండవ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కొమురయ్య సాధారణ బదిలీల్లో భాగంగా సిద్దిపేట త్రీటౌన్‌కు బదిలీ అయ్యారు. రూరల్ పోలీసులు ఆదివారం ఆయనకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విధుల్లో ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుజల్లులకే చిత్తడిగా రోడ్లు



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : చిరుజల్లులకే చిత్తడిగా మారుతున్న రోడ్ల కారణంగా వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి కాటేపల్లి, బేగంపూర్ తండా వెళ్లే దారి వద్దం నుండి పెద్దదేవిసింగ్ తండా వంటి మారుమూల ప్రాంతంలోని రహదారులు పూర్తిగా చిరుజల్లులకే చిత్తడిగా మారిపోతున్నాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సరస్వతి విద్యాలయం 2002-03 బ్యాచ్ విద్యార్థులు

దోమకొండ: మండల కేంద్రంలోని సరస్వతి విద్యాలయం 2002–03 పదో తరగతి బ్యాచ్ విద్యార్థు లు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరుపుకున్నారు. తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఉల్లాసంగా గడిపి పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. విద్యాలయం ఉపాధ్యాయులు సిద్ధరాములు, వీరయ్య, ఎల్లం, మహేష్, విశ్వనాథం, గణేష్, మ హదేవ్, రాజేష్, మధుసూదన్, నాగరాజు, గంగభూ షణం, విద్యార్థులు అరవింద్, భాస్కర్ తదితరులున్నారు.

టీం ఇండియా గెలుపుతో యువకుల సంబురాలు



పిట్లం(జుక్కల్) : టీ20 ప్రపంచ కప్‌లో శనివారం జరిగిన భారత్–సౌత్ ఆఫ్రికా ఫైనల్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంతో మండలవ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి యువకులు, క్రికెట్ అభిమానులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు టీమిండియాకు అభినందనలు తెలిపుతూ పటాకులు కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు.

ప్రపంచ కప్ సాధించడం చరిత్రాత్మకం

బాన్సువాడ : టీ–20 ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత్ జట్టు క్రీడాకారులు అభినందనీయులని సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు, క్రికెట్ శిక్షకుడు నరేష్ అన్నారు.

రేషనలైజేషన్‌ను నిలిపేయాలి

కామారెడ్డి టౌన్ : ఎస్టీటీ ఉపాధ్యాయుల బదిలీల వెబ్ ఆప్షన్ ద్వారా జరుగుతున్న అనధికారిక పాఠశాలల రేషనలైజేషన్‌ను నిలిపివేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఖాళీలు ఉన్న వివరాలను బహిర్గత పర్చకుండా అనధికారికంగా రేషనలైజేషన్ చేపడుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు ఖాళీలన్నింటి చూపించి పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పదెకరాల్లోపే రైతుభరోసా ఇవ్వాలి


సదాశివనగర్‌లో మాట్లాడుతున్న డీఏవో భాగ్యలక్ష్మి


దోమకొండలో..


బీబీపేటలో..


భిక్కనూరులో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఆదివారం రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. సదాశివనగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, పద్మాజీవాడి సహకార సంఘాల పరిధిలో రైతులతో సమావేశం నిర్వహించారు. పదెకరాల్లోపు సాగుభూమికి మాత్రమే రైతు భరోసా అందజేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి సీఈవోలు దేవేందర్ రావు, నయీం విగ్నేష్ గౌడ్, భైరయ్య, మర్కెటింగ్ అధికారి నగేశ్, రామారెడ్డి ఎంపీపీ దశరత్ రెడ్డి, సదాశివనగర్ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

దోమకొండ : పదెకరాలలోపే రైతుబంధు ఇవ్వాలని రైతులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుబంధు పథకంపై ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించి రైతుల అభిప్రాయాలను తీసుకున్నారు. మండల ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఏవో పవన్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, వైస్ చైర్మన్ జైపాల్ రెడ్డి, సీఈవో బాల్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

బీబీపేట : రాష్ట్రంలో పది ఎకరాల లోపు వ్యవసాయం ఉన్నవారికి రైతుబంధు పథకం వర్తింపజేయాలన్నారు. ఆదివారం రైతుబంధు పథకంపై మండల ప్రాథమిక సహకార సంఘం సభ్యుల అభిప్రాయ సేకరణ సూచనలపై సొసైటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రైతులు మాట్లాడారు. ఈ సందర్భంగా పండించిన ప్రతి పంటకు రూ. 1,000 బోనస్ ప్రకటించాలని అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు రైతుబంధు పథకం ఇవ్వొదన్నారు. రైతుబంధు పథకం ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, సొసైటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సాయిలు, సీఈవో నర్సాగౌడ్ పాల్గొన్నారు.

భిక్కనూరు : పోడు భూములకు రైతుబంధు పథకం వర్తింపచేయాలని రైతులు సూచించారు. ఆదివారం మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామ సొసైటీ అధ్యక్షులు రాజా గౌడ్ అధ్యక్షతన రైతుబంధు పథకంపై మహాజనసభ నిర్వహించారు. పదెకరాల్లోపు రైతులకు రైతుబంధు పథకం వర్తింపచేయాలని సభాదృష్టికి తీసుకువచ్చారు.సహకార సంస్థ డిప్యూటీ రిజిస్టర్ వెంకటరెడ్డి, సంఘం ఉపాధ్యక్షులు విట్టల్, ఏవో రాధ, వ్యవసాయ విస్తీర్ణ అధికారి రవి, ఎంపీటీసీ సాయా గౌడ్ తదితరులున్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు


మొక్క నాటుతున్న బీజేపీ నాయకుడు పైడి ఎల్లారెడ్డి


కామారెడ్డి పట్టణంలో..


నస్రుల్లాబాద్‌లో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : భారతీయ జన్‌సంఘ్ సేవ స్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా గ్రామాల్లో మొక్కలు నాటాలని బీజేపీ అధిష్ఠానం పిలుపునిచ్చిన నేపథ్యంలో నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణతోపాటు మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామం వద్ద బీజేపీ నియోజకవర్గస్థాయి నేత పైడి ఎల్లారెడ్డి మండల నాయకులతో కలిసి మొక్కలను నాటారు. నాగిరెడ్డిపేట మాజీఎంపీపీ, తాండూర్ ఎంపీటీసీ దివిటి రాజ్ దాస్, బీజేపీ మండలాధ్యక్షుడు హన్మాండ్లు, నాయకులు దేవిసింగ్, వెంకన్న, దేవేందర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి పట్టణంలో..

కామారెడ్డి అర్బన్ : వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సేవా సప్తాహం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక సరస్వతి విద్యామందిర్, శ్రీకృష్ణ మందిరం ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. మొక్కలే ప్రజలకు ప్రాణవాయువును ఇస్తాయనే విషయం ప్రతి ఒక్కరు బాధ్యతగా ఒక మొక్క నాటి పెంచాలని వీహెచ్‌పీ జిల్లా ప్రచార ప్రముఖ్ శ్రీకాంత్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు గంగారెడ్డి, బొల్లి రాజు, అజయ్‌కుమార్, మంచాల రాజు తదితరులున్నారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలో ఆదివారం భారతీయ జనసంగ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ నాయకులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా బాన్సువాడ నియోజక వర్గం అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏక్ పేడ్–మాకా నామ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సున్నం సాయిలు, ఓబీసీ కన్వీనర్ వడ్ల సతీష్, సంజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మురికి గుంతను పూడ్చండి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న మురికి నీటి గుంతను పూడ్చాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీలో ఉన్న మురికి నీటి గుంత కారణంగా వాటిలో పందులు బొర్లాడుతున్నాయని, వీటితో పాటు దోమలు బాగా వృద్ధి చెందాయని దీనిని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు మురికి నీటి గుంతను పూడ్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గ్రామ దేవతలకు మొక్కులు



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని మల్లూర్, గున్కుల్ పంచాయతీల్లో ఆదివారం గ్రామ దేవతలకు పండుగలు నిర్వహించారు. పంచాయతీల్లో దేవతలకు కుల సంఘాల ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించారు.

ఆధ్యాత్మికం

ముత్యాలమ్మ, నల్లపోచమ్మకు బోనాలు



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం ముదాం గల్లి, షేర్‌గల్లీలకు చెందిన మున్నూరుకాపు సంఘాల ఆధ్వర్యంలో శ్రీముత్యాలమ్మ, నల్లపోచమ్మ గ్రామ దేవతలకు బోనాలు ఊరేగించిన అనంతరం అమ్మవార్లకు సమర్పించారు. డప్పు వాయిద్యాలు, డీజే చప్పుళ్లతో బోనాల ఊరేగింపులో పలువురు మహిళలు పునాకాలతో ఊగిపోయారు. జీవాలను బలిఇచ్చారు. కొబ్బరికాయలు, కల్లుసాకలతో భక్తి శ్రద్ధలతో తమ మొక్కులు చెల్లించారు.

ఆటోవాలాల పోచమ్మ పండుగ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట–మెదక్ ఆటోయూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటోవాలాలు ఆదివారం పోచమ్మ పండుగ నిర్వహించారు. ప్రతిఏడాదిలాగే ఈ యేడు కూడా ఆటోవాలాలు పోచమ్మ పండుగ జరిపారు. పండుగలో భాగంగా వారు మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతం నుండి తమ ఆటోలతో ర్యాలీగా గ్రామంలోని శ్రీ నల్ల పోచమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కుకున్నారు. ఆటోలు సక్రమంగా నడవాలని వారు కోరుకున్నారు.

డీఎస్ మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న కాసుల బాల్‌రాజ్, ఏనుగు రవీందర్ రెడ్డి, భిక్కనూరు నాయకులు

బాన్సువాడ : మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యులు ధర్మపురి శ్రీనివాస్ మృతి తీరని లోటు అని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. ఆదివారం డి శ్రీనివాస్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డి. శ్రీనివాస్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రాజకీయ దురందుడని, ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి నిజామాబాద్‌లో డీఎస్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు మనోహర్, బర్ల గంగారం తదితరులు ఉన్నారు.

భిక్కనూరు నుంచి..

భిక్కనూరు : డీఎస్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని భిక్కనూరు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. నిజామాబాద్‌లో డీఎస్ నివాసంలో ఆయన పార్థీవదేహానికి భిక్కనూరు మండల కాంగ్రెస్ నేతలు మద్ది చంద్రకాంత్ రెడ్డి, బాలయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు 'రైతుబంధు'పై ప్రజాభిప్రాయ సేకరణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : రైతుబంధు పంపిణీపై అభిప్రాయ సేకరణ కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట రైతువేదికతోపాటు తాండూర్ సొసైటీ కార్యాలయం ఆవరణలో రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు మాల్తుమ్మెద, తాండూర్ సొసైటీల చైర్మన్లు నర్సింలు, గంగారెడ్డి, సీఈవోలు పవన్, జైపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గోపాల్‌పేటలోని రైతువేదికలో ఉదయం 10గంటలకు, తాండూర్ సొసైటీ కార్యాలయ ఆవరణలో 12గంటలకు రైతుల సమావేశం జరుగతుందని వారు చెప్పారు.


ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలంలోని రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఏఈవోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుబంధు పథకం అమలుపై రైతులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించాలని ఉన్నతాధికారులు సూచించడంతో వారి ఆదేశాల మేరకు మండలంలోని మీసానిపల్లి, ఆజామాబాద్, లక్ష్మాపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాలలోని రైతు వేదికలలో రైతులతో సమీక్ష నిర్వహించామన్నారు.

నేడు తాడ్వాయిలో ప్రజావాణి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్ రహీమొద్దీన్ తెలిపారు. ఈ ప్రజావాణి ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని, ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు.

రైతు సంక్షేమానికే రుణమాఫీ




పిట్లం(జుక్కల్) : రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని సంరక్షించడానికి, రైతులకు అండగా నిలవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, ఏకకాలంలో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ కి కాంగ్రెస్ కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు, మాజీ కోఆప్షన్ సభ్యులు శేక్ నజీర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. రైతుల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ముందుకు వెళ్తోందన్నారు.

4న ఉచిత వైద్య శిబిరం

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘంలో ఈ నెల 4న ఆయుర్వే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని జీవన్ వెల్‌నెస్ నిర్వాహకులు తెలిపారు.

నియామకం..



భిక్కనూరు : జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా పోడియం సందీప్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాదులో జరిగిన సమావేశంలో జాతీయ చైర్మన్ మహమ్మద్ యాసిన్, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయనను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు మర్రి మైపాల్ తెలిపారు. సందీప్‌రెడ్డి మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందినవారు.